

# ప్రేమికులు

అద్దేపల్లి సుచిత్రాదేవి

అందమైన సాయంకాలం.

అసలు సాయంకాలం అన్న పదంలోనే అందం, హాయి దాగినట్లుంటుంది. ఉదయం నుంచి పడిన శ్రమను సేద దీర్చేందుకు చల్లని గాలులు వీస్తూ, విశ్రాంతి నివ్వబోయే రాత్రికి స్వాగతం పలుకుతూ ప్రియ నెచ్చలిలా పలకరిస్తుంది.

అలాంటి అందమైన ఓ సాయంత్రం పార్కులో ఓ మూలగా క్రోటన్స్ మొక్కలచాటుగా స్వప్న కూర్చుని ఉంటే ఆమె ఒడిలో తల పెట్టుకుని హాయిగా పడుకుని ఉన్నాడు వినోద్.

"చక్కని పర్సనాలిటీ, మంచి ఉద్యోగం, మంచి స్వభావం - అన్నిటినీ మించి తనంటే ప్రాణం ఇచ్చేంత ప్రేమ! ఇలాంటి వ్యక్తి తనకు ప్రేమికుడు కావడం, పెళ్లాడబోవటం తన అదృష్టం! రియల్లీ అయామ్ లక్కీ!" - స్వప్న మనసులో అనుకుంటున్న మాటే సరిగ్గా అదే సమయంలో వినోద్ కూడా అనుకుంటున్నాడు.

'నేను చాలా అదృష్టవంతుణ్ని. నేను కోరుకున్న అమ్మాయే నన్ను కోరుకోవటం, ప్రేమించటం. నిజానికి మగవాడి అదృష్టం అతని భార్యను చూసి చెప్పవచ్చంటారు. ఇంతటి అందాల రాశిని నేను స్వంతం చేసుకోవటం చూసి ఎందరు కుళ్లుకుంటున్నారో?' - తనలో తాను చిన్నగా నవ్వుకుంటున్న అతన్ని చూసి అడిగింది స్వప్న -

"ఏమిటీ, ప్రేమ ముదిరి పిచ్చి ప్రకోపించినట్లుంది. నీలో నువ్వే నవ్వుకుంటున్నావు?"

"ఏం లేదు. మా బామ్మ మాటలు గుర్తొచ్చాయి!"

"బుద్ధూ! భామ ఒడిలో పడుకుని బామ్మని గుర్తు తెచ్చుకుంటున్నావా?"

"మరి! దీపమంటి పిల్లని తెచ్చి పెళ్లి చేయాలి మా వినోదుడికి. మగవాడికి జ్యోతిలాంటి పెళ్లాం వస్తే జీవితమంతా ప్రకాశవంత మవుతుం దనేది ఎప్పుడూ నన్ను దగ్గరకు తీసుకుని. ఇప్పుడు నిన్ను చూస్తే ఎంతో సంతోషించేది."

"అయితే నేను జ్యోతిలా ఉన్నానా?" మురిపెంగా అడిగింది స్వప్న.

"కాదు, జ్వాలలా ఉంటావు. నాలో కోరికల మంటల నెగదోస్తూ!" చప్పున ఆమె మెడపై చేయి వేసి, తలను ముందుకు వంచి పెదవు లందుకున్నాడు.

తప్పించుకోవాలని చూసి, సాధ్యపడక, ఓ అరనిముషం అలాగే ఉండిపోవాల్సి వచ్చింది స్వప్నకి.

"అబ్బ! ఎన్నిసార్లు చెప్పాలి, కాస్త నిగ్రహంగా ఉండమని!" చిరుకోపంతో అన్నది స్వప్న.

"ఇంతటి అందాల విగ్రహం ముందు నిగ్రహంగా ఉండటం ఈ గ్రహానికి సాధ్యం కాని పనని నేనూ ఎన్నిసార్లు చెప్పాను?" నవ్వా డతను.

"సిగ్గు లేకపోతే సరి!" ముద్దుగా విసుక్కుంది.

"సిగ్గెందుకు, అన లో మహా రచయిత ఏమన్నాడో తెలుసా! నూరు ఇడ్లీలైనా ఒక పెసరట్టుతో సమానం కాదు. పది పెసరట్లయినా ఒక ప్రేమ కథపాటి చెయ్యవు. ఎన్ని ప్రేమ కథలయినా ఓ ముద్దుకు సాటి రావు అని చమత్కరించాడు!"

"ఇలాంటి కొటేషన్ల కేం బాగానే సేకరిస్తావు!"

"ఏం చేస్తాం! ప్రేమలో పడ్డాక ఇలాంటి కొటేషన్లు సేకరించక తప్పదని మా ప్రేమానందం మాస్టారు సెలవిచ్చారు మరి!"

"ఆ ప్రేమించిన అమ్మాయిని త్వరగా పెళ్లాడాలని మీ మాస్టారు సెలవివ్వలేదా?"

"ఊహు! వీలైనంతకాలం ప్రేమికులుగా ఎంజాయ్ చేసి, ఆ తర్వాతే పెళ్లి చేసుకోమన్నారు. ఇలా దొంగతనంగా కలుసుకోవడం, కబుర్లు చెప్పుకోవడం, ఓ చిన్న ముద్దు కోసం నేను ఆరాటపడటం, నువ్వు కావాలని ఉన్నా వద్దనడం, చివరికి నేనే గెలవడం - ఇలాంటి థ్రిల్సన్నీ పెళ్లయిపోతే ఏ ముంటాయి చెప్పు!"

"నీకు థ్రిల్‌గానే ఉంటుంది. కానీ నాకు దిగులుగా ఉంటుంది."

"దిగులా! దిగులెందుకు!" ఆశ్చర్యంగా అడిగాడు వినోద్.

"నువ్వాడపిల్లవై ఉంటే, నీకు తెలిసి ఉండేది. ఇలా మనిద్దరినీ చూసిన నలుగురూ నాలుగు విధాలుగా అనుకోవడం నాకు బాగుండదు!"

"ఇందులో అనుకునే దానికేముంది! ఎటూ పెళ్లి చేసుకోబోయే వాళ్లమేగా!"

"అలా అనుకుంటూనే ప్రతి ఆడపిల్లా అబ్బాయితో తిరుగుతుంది. ప్రేమికులంతా పెళ్లి చేసుకునే తీరుతున్నారా చెప్పు! ఎందరు మోసపోవడంలేదు!" మనసులోని మాట అన్నది స్వప్న.

ఆమె ఒడిలోనుంచి దిగ్గున లేచి కూర్చున్నాడు వినోద్.

"మోసం! నువ్వేమనుకుంటున్నావు నా గురించి!" అడిగాడు కందిపోతున్న ముఖంతో.

అత నంతగా హర్టవుతావని అనుకోలేదు స్వప్న. ఓ క్షణం తడబడింది.

"నే నన్నది నిన్ను గురించి కాదు. లోకంలో ఉన్న సంగతి చెప్తున్నాను."

"నిజమైన ప్రేమికులైతే ప్రేమ తప్ప మరేమీ గుర్తు రాదట. నువ్వు నా సమక్షంలో కూడా ఎప్పుడూ లోకం, సమాజం గురించే ఆలోచించి చెప్తూంటా వంటే ..." ఆ పైన ఏమీ అనలేక నిశ్శబ్దంగా ఉండిపోయాడు.

"అది కాదు, వినోద్! అసలు పెళ్లికి నువ్వెందుకు ఆలస్యం చేస్తున్నావో నా కర్థం కావటంలేదు!"

"పెళ్ళికి ప్రేమ ముఖ్యమో, ప్రేమకు పెళ్ళి ముఖ్యమో నాకూ అర్థం కావడంలేదు. పద వెళ్దాం!" వెళ్ళేందుకు లేచి నుంచున్నాడు వినోద్.

స్వప్నకి అయోమయంగా అనిపించింది. హఠాత్తుగా ఎందుకతని మూడ్ అవుట్ అయిందో తెలియలే దామెకు. తా నన్నదానిలో అంత తప్పేమిటో కూడా తోచలేదు. ఇక అప్పుడు త నేం చెప్పినా వినేలా లేడని తనూ లేచి నిలబడింది.

ఆ తర్వాత దాదాపు మౌనంగానే ఇద్దరూ ఎవరిదారిన వాళ్ళు వెళ్ళిపోయారు.

** ** **

ఆ రోజు తర్వాత వరుసగా నాలుగు రోజులు వినోద్ కనిపించనే లేదు స్వప్నకి. తనను చూడకుండా ఒక్క రోజైనా ఉండలేని వినోద్ నాలుగు రోజులైనా జాడలేకపోవడంతో కంగారయింది స్వప్నకి.

అయిదో రోజు అతని రూమ్ వెతుక్కుంటూ బయలుదేరింది. గదిలో కూర్చుని పుస్తకాల్లోని బొమ్మల్ని చూస్తూ వినోద్ చిత్రాలు వేస్తున్నాడు. అ వేయడం చూస్తుంటే అ దేదో కాలక్షేపానికి చేస్తున్నట్లుగా ఉంది. స్వప్నని చూడగానే వినోద్ ముఖంలోకి చప్పున వెలుగు వచ్చింది.

"స్వాగతం, స్వప్నసుందరికి!" ఆదరంగా ఆహ్వానించాడు.

గది నాలుగు వైపులా చూస్తూ తటపటాయిస్తూ కూర్చుంది స్వప్న.

"ఊఁ, నన్ను చూడకుండా నువ్వు నాలుగు రోజులుండగలిగా వన్నమాట!" నవ్వుతూ అన్నాడు.

"నాలుగు రోజులైనా నేనే వచ్చాను కానీ, నువ్వు కాదుగా! నువ్వయితే నన్ను చూడకుండా ఎన్ని రోజులైనా ఉండగలిగేటట్లున్నావు!" చిరుకోపంతో రుసరుసలాడింది.

"నేనా? నిన్ను చూడకుండానా! ఒక్క రోజు కూడా ఉండలేను. అందుకే నిన్ను రోజూ చూస్తూనే ఉన్నాను!" అదే నవ్వుతో అన్నా డతను.

"అంత అబద్ధం!"

"నిజం! రోజూ నువ్వు కాలేజీ నుంచి వెళ్ళేటప్పుడు నీ కనిపించకుండా చాటుగా నిన్ను చూస్తూనే ఉన్నాను. కావాలంటే గుర్తులు చెప్పనా? నువ్వు నిన్న పింక్ కలర్ శారీ కట్టుకున్నావు. మొన్న చాందినీ చుడీదార్, అంతకుముందు రోజు ఎల్లో డ్రెస్!" అతను అల్లరిగా చెప్తుంటే తెల్లబోతూ చూసింది స్వప్న.

"నా కనిపించకుండా చాటుగా నన్ను చూస్తున్నావా? ఎందుకలా!"

"ఎందుకంటే నేను నిన్ను చూడకుండా ఉండలేను కనుక! ను వ్వెన్నిరోజులు ఉండగలవా అని చూద్దామనుకున్నాను. ప్చ్! నువ్వు నాలుగు రోజు లుండగలిగావు!" అతను కాస్త కినుకగా అన్నాడు.


ఇది మరీ ఆశ్చర్యంగా అనిపించింది స్వప్నకి.

"నీకు కాస్త తిక్క ఉన్నట్లుంది!" కోపంగా అంది.

"థాంక్స్ ఫర్ ది కాంప్లిమెంట్!" హాయిగా నవ్వుతూ అన్నాడు.

ఉక్రోషంగా ముఖం తిప్పుకుంది స్వప్న.

"నా క్కాబోయే శ్రీమతి మనసులో నా మీద



ఎంత ప్రేముందో తెలుసుకోవాలనుకున్నాను. తప్పా!" దగ్గరకొస్తూ అడిగాడు.

"తప్పో, తప్పున్నరో తేలుస్తా. కానీ, పద! బయట కెళ్దాము!" లేవబోయింది.

కానీ ఆమె నెంత దగ్గరగా చూస్తున్న వినోద్ తనవైపు లాక్కున్నాడు. పూలచెండులా అతనికి చేతుల మధ్య చేరింది స్వప్న.

ఆమెకు వారించే అవకాశ మివ్వకుండా పెదవు లందుకున్నాడు తన పెదవులతో. అతని రెండు చేతుల మధ్య తన ముఖం! ముఖం అటూ ఇటూ తిప్పే అవకాశం కూడా లేకపోయింది స్వప్నకి.

ఆ తీయని ముద్దుతో మైమరిచిన అతను మరింతగా ఆమెను హత్తుకోబోయాడు. ఇక అత నెంతవరకూ వెళ్ళగలడో ఊహించిన స్వప్న తన బలమంత ఉపయోగించి అతన్ని దూరంగా నెట్టింది.

"నీ కేమన్నా పిచ్చెక్కిందా ఇవాళ? ఏమిటిది?"

"ప్లీజ్, స్వప్నా! ఒక్కసారి దగ్గరకు రా! కాదనకు!" అతను మరో లోకంలో ఉన్నట్లున్నాడు. మళ్ళీ దగ్గరకు రాబోయాడు.

"వినోద్! ను వ్వేదోలా ఉన్నావు. నే నిక వెళ్తాను!" హేండ్‌బాగ్ అందుకుంది.

"ప్లీజ్, స్వప్నా! ఎప్పటికైనా మనం ఒకటి కావాల్సిన వాళ్ళమేగా!" గుమ్మం వైపు వెళ్ళబోతున్న ఆమెకు అడ్డం వస్తూ చేయిపట్టుకుంటూ, కళ్ళలోకి చూస్తూ అడిగాడు.

"అవన్నీ పెళ్ళయిన తర్వాత, పెళ్ళికి ముందు ఇదంతా నా కసహ్యం! వదులు, వినోద్! నేను వెళ్తాను!" ఆమె ముఖంలో అదే కోపం.

మెల్లగా చేయి వదిలేశాడు వినోద్.

"వెళ్ళు!" నిర్లిప్తంగా అన్నాడు.

స్వప్న వడివడిగా వెళ్ళిపోయింది - ఓసారి వెనుతిరిగైనా చూడకుండా. ఆమె వెళ్ళిన చాలాసేపటివరకు వినోద్ అలాగే ఉండిపోయాడు. ఆ తర్వాత వెళ్ళి మెల్లగా తన రైటింగ్ టేబుల్ ముందు కూర్చుని, పెన్నూ పేపరు చేతిలోకి తీసుకుని రాయసాగాడు.

"స్వప్నా!

"పెళ్ళికి ముందు నా కివన్నీ అసహ్యం!" అన్నావు. నిజంగా నీకు నన్ను తప్ప వే రెవ్వరినీ పెళ్ళాడే ఉద్దేశమే లేకపోతే నీకు నేను తాకటం అసహ్యంగా అనిపించి ఉండదు. కానీ నేను బతుకు అంటూ ముడిపడితే నీతోనే అనుకున్నాను. అందుకే నువ్వు నాకు పరాయిగా ఎప్పుడూ అనిపించలేదు. మనం భార్యాభర్తలుగా ముద్రపడకుండా ఒకటి కావాలనుకోవడం తప్పేనేమో కానీ, అది నువ్వు నాకు వద్దని చెప్పే పద్ధతి మాత్రం ఇది కాదు. చేతుల మధ్య నీ కళ్ళలో భయం, తప్పు చేస్తున్నామన్న భావం తప్ప ఓ క్షణం కూడా పారవశ్యత కనిపించలేదు. నిజంగా ...! నిజంగా నువ్వు నన్ను ప్రేమిస్తున్నావా అన్న అనుమానం కలుగుతోంది నాలో.

ఈ కాలపు తెలివైన అమ్మాయిలా ప్రవర్తిస్తున్నావు. అంతేనా! మన పరిచయం అయిన రోజు నుంచీ చూస్తున్నాను. నీకు నాతో తొందరగా పెళ్ళయిపోవాలి. ఎందుకంటే నేను అన్ని అర్హతలు ఉన్న పెళ్ళి కొడుకును కనుక.

నా కీ రోజు బాగా తెలిసింది. నువ్వు నన్ను ప్రేమించి నాకు దగ్గర కాలేదు. మీ వాళ్ళకు ఓ ఆడపిల్ల పెళ్ళి బాధ్యత తప్పించేందుకు నన్ను ఎన్నుకున్నావు. అవునా! కానీ నేను మాత్రం నన్ను మనసారా ప్రేమించే అమ్మాయికే తాళి కట్టదల్చుకున్నాను. నువ్వు నన్ను ప్రేమిస్తున్నట్లు నాతో చెప్పేందుకు ప్రయత్నించకు. నేను నమ్మలేను. నేను తప్ప నీ కీ లోకంలో మరేవనీ లేదనుకుంటే నీకు నాలో ఓ మొనగాడు కనిపించడు. నాతో పంచుకున్న ఈ మధుర క్షణాల వలన రే పేమవుతుందో నన్న భయం, సందేహం కలగదు. నీకు నాకన్నా జీవితం మీద భద్రత భావం జాస్తి. పరవాలేదు. నేను కాకున్నా నీకు మరో మంచి భర్త దొరికేలా నువ్వు చూసుకోగలవు!

"బెస్టాఫ్ లక్!

"వినోద్."

పోస్ట్‌లో ఆ ఉత్తరం అందుకున్న స్వప్న కసిగా అనుకుంది - 'అవును! ఇతగాడు పిలవగానే ఒళ్ళో వాలిపోలేదు కనుక నా కతనంటే ప్రేమ లేదు. అదే నేను ఒప్పుకుని ఉంటే అప్పుడు ఈ మహానుభావుడే ఇంత తేలిగ్గా ఒకే అన్నావు, నేను నీకు ఎన్నోవాడినో అన్న సందేహం లేవదీస్తాడు.

'హుఁ! మగవాడు! ఆ నాలికకు రెండువైపులా పదునే. అరిటాకు ముల్లు మీద పడ్డా, ముల్లు అరిటాకు మీద పడ్డా అరిటాకుకే ముప్పు అన్న సామెతను మార్చి, ఈ కాలంలో అరిటాకు చిరిగినా తప్పే, చిరగకున్నా తప్పే అనాలేమో! రిజెక్ట్ చేసే ఛాన్స్ మొగవాడి కున్నంతకాలం, ఆడపిల్ల పెళ్ళి అనే సెక్యూరిటీ ఫీలింగ్ కోసం తహతహలాడుతున్నంత కాలం నాలాంటి అమ్మాయి 'ఊఁ' అన్నా మగవాడి కోరికకు 'ఊహూ!' అన్నా తప్పే!'

"ఏమి టా ఉత్తరం, స్వప్నా! ఎక్కణ్నుంచి?" - ఏదో పని చేసుకుంటూ అటుగా వచ్చిన తల్లి అడిగేసరికి ఓ క్షణం కంగారుపడినా, సర్దుకుని చెప్పింది స్వప్న -

"ఎటూ ఈ సంవత్సరంతో చదువైపోతోంది కదాని ఓ జాబ్‌కి అప్లై చేశానమ్మా! సెలెక్ట్ చేసుకున్నారు కానీ ముందు డిపాజిట్ కట్టాలట! అదే ఆలోచిస్తున్నా!"

"కడితే సరి! దానికి ఆలోచన ఎందుకు - మంచి ఉద్యోగమైతే!"

"మంచిదే. కానీ కొత్త కంపెనీ. తీరా అందరి దగ్గరా డిపాజిట్ కట్టించుకుని మోసం చేస్తే?"

"అలాంటప్పుడు వదిలెయ్! దాని గురించి ఆలోచన ఎందుకు? ఇది కాకపోతే దీనికన్నా భేషైనది మరొకటి దొరుకుతుంది."

తేల్చి చెప్పేసి చక్కా లోపలి కెళ్ళిపోతున్న తల్లిని చూస్తూ, చెక్కిలిపై జారిన కన్నీటిని తుడుచుకుని చేతిలోని ఉత్తరాన్ని చింపేసింది స్వప్న.